

# అమెరికా అమ్మాయి

## – శ్రీనిధి యెల్లల



### హోమ్...స్వీట్ హోమ్ ఛాలెంజ్

**ఎటువంటి** విపత్కర పరిస్థితులకైనా కొంత సమయం తర్వాత మనిషి రాజీ పడి అలవాటుపడిపోతాడేమో! బే ఏరియాలో 'షెల్టర్ ఇన్ ప్లేస్' ఈ నెల చివరిదాకా పొడిగించారని చెప్పినప్పుడు అదే అనిపించింది. వార్తల పట్ల, సంఖ్యల పట్ల కూడా ఉదాసీనత వచ్చేసింది. నిండా మునిగాక ఇంకా చలి చలి అని వణకడం ఎందుకని 'ఇల్లే వైకుంఠం కడుపే కైలాసం' అనుకుని, ఆ మాటని 'హై లైటర్' తో దిద్దుకుని గోడలకి అంటించుకుని మరీ నెట్టుకొచ్చేస్తున్నాం. మొత్తానికి నేను కూడా నా మనవళ్లకో, మనవరాళ్లకో చెప్పుకుని 'చూసి నేర్చుకోండి! మీరూ ఉన్నారెందుకూ ?' అని బుగ్గ పొడిచి వినిపించి విసిగించి తృప్తి పడటానికి వచ్చినట్టుంది ఈ 'ఖ్వారెంటైన్.'

లాక్ డౌన్ పుణ్యమా అని ఈ జన్మకి చూస్తాను అనుకోని సంఘటనలు కొన్ని చూస్తున్నాను. పాపం పవళింపు సేవ ఇలా చేస్తారో లేదో మళ్లీ స్పెషల్ దర్శనాల కోసం అని మేలుకొలుపులు పాడి నించోపెట్టేసేవారు ఏడుకొండల స్వామిని అని తెగ బాధపడేదాన్ని. ఇన్నేళ్లకి ఆయనకి కాస్త విశ్రాంతి దొరికింది. తిమింగళాల నుండి తాబేళ్ల వరకూ, పక్షుల నుండి మృగాల వరకూ అన్ని హాయిగా, భయం లేకుండా విహారం చేస్తున్నాయి. పంజరాల్లోని వారు బయటికి, ఊరి మీద పడి ఊరేగే వారు లోపలికి వెళ్లిపోయారు. ఎంత విచిత్రం?! ఇలా ఖ్వారెంటైన్ జీవితాలని ఇంకో కోణం నుండి చూస్తూ మామూలు రోజులు త్వరగా రావాలనుకోడం తప్పించి చేసేది ఏమి లేదు కూడా.

ఏదో నేనంటే అమెరికా వచ్చినప్పటినుండి డిపెండెంట్ గా ఇంట్లోనే గత ఆరేళ్ల నుండీ సెల్ఫ్ ఖ్వారెంటైన్ లో ఉండబట్టి గుట్టుగా నెట్టుకొచ్చేస్తున్నాను కానీ మా వాళ్లంతా కిందా మీదా ఐపోతున్నారు. కాకపోతే ఇది వరకూ కాస్త 'పెరోల్' మీద షైర్లు, షికార్లు, జల్సాలు ఉండేవి. ఇప్పుడన్నీ బంద్. అంతే తేడా.

ఈ విషయం తెలీక ఒకటే విసిగించేస్తున్నారు మా వాళ్లు. ఎలా చెప్పాలి వీళ్ళకి?

"పాస్ ది బ్రష్ ఛాలెంజ్ చేద్దామా, మేకప్ ముందు మేకప్ తర్వాత వీడియో తీసి అందరం ఇంస్టాలో అప్లోడ్ చేద్దాం. డోల్గొనా కాఫీ ఛాలెంజ్ కి నిన్ను టాగ్ చేసాను. హెయిర్ కట్ ఛాలెంజ్ కి కూడా టాగ్ చేసా. అనుష్క శర్మ కోహ్లీ కి చేసినట్టు బావకి హెయిర్ కట్ చేసినప్పుడు వీడియో తీసి పెట్టి ఉండొచ్చు కదా? మంచి ఛాన్స్ వేస్ట్ చేసావ్. పెళ్ళికాలేదు కాబట్టి ఈ ఒక్క ఛాలెంజ్ మిస్ అయ్యా నేను. మనవాళ్లంతా వీడియో చేసి పెట్టారు. నీకేమైందే? ఓ బడాయి కాకపోతే." అని మా కజిన్స్ ఒకవైపు గోల.

జూమ్ మీటింగ్ లో స్కూల్ ఫ్రెండ్స్ అందరూ కలిసి పాత జ్ఞాపకాలని అస్సలు పాతబడనీయకుండా వెయ్యిన్నొక్కో సారి మళ్లీ అవన్నీ తిరగదోడుదామని పిలుపులు మరొకవైపు. అచ్చం డ్రిల్ పీరియడ్ ముందు సైన్స్ పీరియడ్ మాథ్స్ పీరియడ్ ఉండి, మా సైన్స్ టీచరు మాథ్స్

టీచర్ ఇద్దరు స్కూలుకి రాని రోజున మా క్లాస్ ఎలా ఉండేదో అలా ఉంది ఆ జూమ్ మీటింగ్ . ఎవడి గోల వాడిదే. ఎవడి అనుభవాల అనుభూతుల ఆవేశం వాడిదే. చంద్రముఖి నగలు చూపెట్టే జ్యోతికలాగా కనిపించారు ఒక్కొక్కరూ. పది నిమిషాల్లో లాగ్ అవుట్ అయిపోయా.

"ఓ మై గాడ్! ఎలా వుంటున్నావే నువ్వు ఇన్నేళ్ళుగా. ఆల్ అఫ్ ఎ సడన్ ఇంట్లో ఉండిపొమ్మంటే ..ఇట్స్ టూ మచ్ ఐ సే. నా వల్ల అస్సలు కావటం లేదు." నోటితో నవ్వుతూ నొసటితో వెక్కిరిస్తోంది కలిసి చదువుకుని జాబ్ చేసుకుంటున్న ఫ్రెండ్.

"మా ఫ్రెండ్ టిక్ టాక్ స్టార్ అంట. పాపవి నీవి రెండు ఫోటోలు పంపిస్తే పాప బర్త్ డే కి కొత్త కాన్సెప్ట్ తో విషెస్ చెప్తుందిట. మంచి ఫోటోలు రెండు పంపవే. అయినా నీ వాట్సాప్ డీపీ మార్చి చాలా రోజులైంది. ఏమైందే నీకు? క్వారెంటైన్ డిప్రెషన్ లో లేవు కదా. ఇంట్లోనే డిప్రెషన్ పోగొట్టే చిట్కాలు యూట్యూబ్ లో బోలెడు ఉన్నాయ్ , పంపిస్తాను చూడు. ముందు మంచి డీపీ మార్చు వాట్సాప్ కి. మా వాళ్ళందరి పిల్లలూ పూటకొకటి మార్చేస్తున్నారు..మరేమో, చిరంజీవి ఉప్మా పెసరట్టు వేసాడు తెలుసా?" వరదలా పొంగి పొరలుతున్న ఇంటర్నెట్ ఇన్ఫర్మేషన్ లో మునుగుతూ తేలుతూ చెప్పుకుపోతూనే ఉంది పిన్ని. నిద్రొస్తోందని చెప్పి పెట్టేసాను.

"అమ్మాయ్! రోజు కొంచం అల్లం దంచి అందులో నుండి రసం పిండి పసుపు కలుపుకుని ముగ్గురూ పుచ్చుకోండి."

"అవి ఎలాగూ కూరల్లో వేస్తాం కదా అత్తయ్య?"

"అలా అయితే దాని మహత్యం తగ్గిపోతుంది. అంత కూరలో ఓ మూలకి కూడా ఉండదు. విడిగా అచ్చంగా కాసింత తీసుకోండి. చేసాక ఫోటో పంపించు వాట్సాప్ లో! అవునూ 'ఇలా చేసారంటే ఏ వైరస్ మీ ఇంటి దరిదాపుల్లోకి రాదు!!', 'వేడి నీళ్ళల్లో ఇది మూడు చుక్కలు వేసుకుని తాగితే కరోనా పరార్!', 'మన ప్రాచీన చిట్కా వైద్యం దెబ్బకి కరోనా అబ్బా.' అనే మూడు వీడియోలు పంపించానా నీకు! చూసిందీ లేనిది ఏ విషయం చెప్పలేదే?ఎందుకూ?"

"హలో హలో...ఆ అత్తమ్మ! సిగ్నల్ వీక్ గా ఉన్నట్టుంది. ఇప్పుడు చీకట్లో మెద్ది మీదికి ఏం ఎక్కుతారు లెండి. తర్వాత చేస్తానేం. ఉంటాను. ఆ ఆఁ ! తప్పకుండా. నేను పుచ్చుకోకపోయిన మీరు చెప్పారు కదా...మీ అబ్బాయికి పరగడుపునే పట్టిస్తానులెండి అల్లం పసుపు రసాయనం. ఉంటాను. మామయ్య జాగ్రత్త...అదే మామయ్యని అడిగానని చెప్పండి." మా అత్తగారి ఆన్లైన్ పాఠాలు ఇలా.

కథల ఛాలెంజులు, పాటల ఛాలెంజులు, వంట చేసే ఛాలెంజు, చేసింది తినే ఛాలెంజు, కోడి కూస్తే ఛాలెంజు, నిద్రలేస్తే ఛాలెంజు. ఇలా ఎటుచూసినా ఛాలెంజులే. ఇంతలేసి తీరికలేంటో జనాలకి! బయటికి వెళ్లకపోడం తప్పించి మిగతా పనులంతా అలానే ఉన్నాయి కదా? అయినా కూడా కేబుల్ టీవీ లేని రోజుల్లో సెలవులు ఎక్కువైపోయిన స్కూల్ పిల్లలలాగా ఒకటే కిచకిచలాడిపోతున్నారు జనాలు నెట్టింట్లో. మనం కలవకుండా విడిగా ఉండిపోడానికి కూడా వీల్లేదు "నీకే ఉందా ఇల్లు-పిల్లలు!" అని నిష్ఠూరాలు వేరే.

ఇటుచూస్తే ఇంట్లో ఉన్న ఇద్దరికీ నేనే పెద్ద దిక్కు ఇప్పుడు. మొత్తంగా సూర్యుడి మీద ఆధారపడిన పొద్దుతిరుగుడు పూవుల్లా నా చుట్టూనే గడుస్తోంది వీళ్ల జీవనం. నేను కాదు అసలు 'డిపెండెంటు' వీళ్లే నా మీద పూర్తిగా ఆధారపడి ఉన్నారు అనిపిస్తోంది. సుబ్బరంగా ఇంకాస్త ఎక్కువ అజమాయిషీ చేస్తూ ఆనందిస్తున్నాను.

ఏనేళ్ళ కల ఇది మరి?

చిన్నప్పటి నుండి చుట్టూ ఉన్న జంటలను చూసి ఎన్ని కలలు కన్నాను. మునుపటి రోజు ఎలా గడిచినా ప్రతి తెల్లవారి కలిసి కూర్చుని కాఫీ తాగనిదే రోజు మొదలయ్యేది కాదు అమ్మ నాన్నకి. నిద్ర కళ్ళతో వచ్చి అమ్మ ఒళ్ళో బజ్జోని వాళ్ల కిలకిలలు వింటుంటే అచ్చం కొమ్మ మీద గువ్వపిట్టల కువకువల్లానే ఉండేది నాకు. అమ్మ నాన్న నవ్వుతూ మాట్లాడుకుంటుంటే ఎంత హాయి వేసేదని. చెప్పలేని ధైర్యం, ఉత్సాహం పుట్టుకొచ్చేవి. పెద్దయ్యాక నా కంటూ ఒక గూడు కట్టుకున్నాక ఎలా ఉండాలో, ఎలా ఉండకూడదో అని తెలీకుండానే ఒక లిస్టు పుట్టుకొచ్చేస్తుంది కదా మనకి. అందులో మొట్ట మొదట శ్రీ రామ చుట్టి రాసుకుని పచ్చ రంగుతో టిక్ మార్కు పెట్టుకున్న విషయం ఇదే.

ఓ సారి చెప్పా పెట్టకుండా ఇంటికి చుట్టాలు వస్తే ఎదురింటి అత్త దగ్గర గుడ్లు అడిగి తీసుకుని రమ్మంది అమ్మ. తీరా వెళ్లేసరికి పెరటి లోంచి మాటలు వినిపిస్తుంటే వెళ్లేసరికి చక్కగా కబుర్లు చెపుతూ మామయ్యకి తలంటుతోంది అత్త. ఉన్నట్టున్నట్టు నీళ్లు చిలకరిస్తున్నాడు మామయ్య అత్త మీదికి. ముచ్చటగా అలా చూడాలి అనిపించింది కానీ కొత్తిమీర అనో కోడి గుడ్లనో చెప్పి వాళ్లని వేరుచేయడం ఇష్టం లేక ఇంటికి వచ్చి అత్తవాళ్లు ఇంట్లో లేరని చెప్పేసా. స్వయంగా మా అమ్మే వేటకి వెళ్లి తెచ్చి కూర చేసిపెట్టినా ఉప్పు ఎక్కువనో కారం తక్కువ అనో చెప్తారు ఈ చుట్టాలగాళ్లు. ఒక పూటకి పప్పన్నం తింటే ఏమీ తరిగిపోరులే అనుకున్నా.

ఇట్లాగ పెద్దమ్మకి చెప్పి కానీ ఎటూ వెళ్లని పెదనాన్నలు, పెళ్లికి ముందే పిన్నిని చూసిరావడానికి గోడదూకి దొరికిపోయిన బాబాయిలు, బస్సులో వెళ్లేటప్పుడు రోడ్డు మీద స్కూటర్ మీద వెళ్లే జంటలు, తిరుమలకి వెళ్లినప్పుడు ఇద్దరేసి పిల్లలని చెరొకరు ఎత్తుకుని ఆ గుంపులో తప్పిపోకుండా ఒకరి చెయ్యి ఒకరు పట్టుకుని జన సముద్రాన్ని ఈదుకుంటూ వడివడిగా అడుగులు వేసుకుంటూ వెళ్లేవారు, రుస రుసలాడుకుంటూనే ఒకరి మీద ఒకరికి ఎంత అపేక్ష ఉందో చూపెట్టుకునే వాళ్లు ఇలా ఎంతోమందిని గమనిస్తూ పెరిగాను! జంటగా ఉన్నవారిని చూస్తే భలే ముచ్చటగా అనిపించేది.

అసలు ఏ వివరం తెలీని వయసులో హాయిగా పెళ్లంటే, మనం ఇష్టమొచ్చినట్టు అలంకరించుకుని ముచ్చటపడడానికి ఒక ఇల్లు, పెత్తనం చేయడానికి ఒక మనిషి, ముద్దు చేసి ఆడుకోడానికి ఇద్దరు పిల్లలు అని అనుకునే దాన్ని.

ఈ జ్ఞానంతో ఉత్తుత్తి ఊహా మొగుడితో చింత చెట్టు కిందో, కానుగ చెట్టు కిందో బుడుగులు పెట్టుకుని ఎన్నెన్ని ఆటలనీ! మనకి కావాలనుకున్నప్పుడు ఆఫీసుకు పంపొచ్చు. ఊహల తాళింపులతో మనకు నచ్చిన, మనకు ఇష్టమైన వంటలే వడ్డించొచ్చు. తిరిగి మనం ఇంటికి వస్తే బాగుండు అనుకున్నపుడు వచ్చేస్తాడు. లేదూ మనసు మార్చుకుని మనం ఏ ఐ.ఏ ఎస్ ఆఫీసరో, డాక్టరమ్మో అయ్యామనుకోండి ఎంచక్కా వాడి గురించి మర్చిపోవచ్చు. ఏమీ అనుకోడు. మళ్లీ ఎప్పుడో గుర్తొచ్చి ఉత్తుత్తి చెమటలు తుడుచుకుంటూ పిలిస్తే కాఫీ తాగడానికి వచ్చేస్తాడు. చివరికి కొండ మీద కొన్న పాపాయి బొమ్మకి కూడా మనకి ముద్దు చెయ్యాలి అన్నప్పుడే ఆకలి వేస్తుంది. ఉత్తుత్తి లాలలు, అమ్మ పాడేటప్పుడు విన్న వచ్చి రాని జోలలు. ఎంత చక్కని ఆటలు. అద్దమంటి స్వచ్ఛమైన భావాలూ .

ఇవి చాలవన్నట్టు లేని పోనీ ఆశలు పుట్టించే సినిమాలు ఒకటి. కళ్ళు తెరవకుండానే బ్రషు, దాని మీద పేస్టు అడిగే 'మిస్టర్ పెళ్ళాం' 'బాలాజీ' ని చూసి నిజం మొగుడు ఇలా ఉంటాడా అని దడుచుకుని చచ్చా. నేనే ఆ 'ఝాన్సీ' అయ్యుంటేనా అని ఎన్ని శపధాలు చేసేసుకున్నానో. ఆ భయాలు పోగొట్టేలా కనిపించాడు 'పెళ్లి పుస్తకం' లో 'కె. కె'.ఇట్లా రకరకాలుగా జంటలని పరిశీలిస్తూ, నాకు నేనే వడపోతలు చేసుకుంటూ 'ఉభయకుశలోపరిగా' ఉండే లిస్టు చేసుకుంటుండగానే కాస్త పెద్దదాన్నయిపోయా. అప్పుడు కలిసారు 'విమల-బుచ్చిబాబు.' అసలు సిసలు తెలుగు సంసారం ఎట్లా ఉండబోతోందో కళ్లకు కట్టినట్టుగా చేసారు. ఆపైన 'రుక్మిణీ కళ్యాణం' కూడా చదువుకున్న పిల్లకు ఒక పురుష రత్నమును ఇచ్చి పెళ్లి చేసి పడేసారు పెద్దలు. ఒక ఆదర్శ జంట ఎల్లా ఉండాలో అన్న నా థీసిస్ ఇంకా పూర్తవ్వకుండానే తోసేసారు సంసారంలో. అప్పటి నుండి సమయానికి, జీవితానికి లంకె వేసుకుని ఈదుకొస్తూనే ఉన్నాను.

తరువాత ఏముందీ ... ఊహలకి వాస్తవాలకీ ఉన్న తేడాలు చూసి అవాక్కయ్యా. ఇన్ని సంవత్సరాల నుండి నా వైపు అభిప్రాయాలు మాత్రమే పోగు చేసుకుంటూ వచ్చానే గానీ అవతలి వ్యక్తి వైపు నుండి ఎప్పుడూ ఆలోచించింది లేదు. పెళ్లి చేసుకుంది బొమ్మనా? కాదు కదా! నా కన్నా కాస్త ఎక్కువ ప్రపంచం చూసి అప్పటికే అతను కూడా కొన్ని దృఢ నిశ్చయాలకి వచ్చేసి ఉన్నాడు. కరవమంటే కప్పకు కోపం, విడవమంటే పాముకు కోపం లాగా ఉండే ఇద్దరి అభిప్రాయాలను మధించి, చెరో వైపు నుండి లాగుతున్న అతని వైపు వాళ్ళని నా వైపు వాళ్లని సంబాళించుకుని, ఈగో జ్వాలలని దిగమింగుకుని ఇద్దరం కూడబలుక్కుని ఒక తాటిపై నిలబడే లోపు బుడ్డది వచ్చేసింది. వెనక్కి తిరిగి చూసుకుంటే నా లిస్టులో ఉన్న చిన్న చిన్న సరదాలు తీరనేలేదు.

అన్నిటికీ ఒక్కటే సమాధానం "సమయం ఎక్కడ? తీరిక ఏది?" అని.

అదీ నిజమే. మైళ్ళ కొద్దీ ప్రయాణం చేసి ఆఫీసు చేరుకోవాలి. తిరిగి అంత దూరమూ ప్రయాణించి ఇల్లు చేరుకోవాలి. మాట్లాడించాలన్నా అలసటతో తోటకూర కాడలా వేళ్ళాడే మొహం చూస్తే గుండె తరుక్కుపోయేది. సోమవారం నుండి శుక్రవారం వరకూ పనిలో పడి చిక్కడు! శని ఆది వారాల్లో విశ్రాంతి అని దొరకడు! ఉన్న కాసింత సమయంలో వాటాలకు వచ్చే పెద్ద వాళ్లు, స్నేహితులు. అతని సమయం మొత్తంగా నాకే కావాలి అనుకునేంత స్వార్థం ఒకవైపు. తనకి కాస్త ఊపిరి తీసుకునే వెసులుబాటు ఇవ్వాలి కదా అనే ఇంగితం ఒకవైపు. స్వార్థం గెలిచినప్పుడు యుద్ధం, ఇంగితం గెలిచినప్పుడు మౌనం. ఏది గెలిచినా వెంటాడే ఒంటరితనం. సముద్రమంత దాహాన్ని ఉద్ధరిణెడు తీర్థంతో తీర్చుకోవాలనే వెర్రి ప్రయత్నం. ఇద్దరికీ సమయం చూపించే గడియారం ఒకటే అయినా నే చూసేటప్పుడు గూడ్సు బండిలా కదులుతుంది. అతనికేమో గ్రాండ్ ట్రంక్ లాగా మెరుపు వేగంతో దూసుకెళ్లిపోతుంది.

ఇలా కళ్ల ముందే కరిగిపోతోన్న కాలంతో రాజీ పడి నెట్టుకొచ్చేస్తున్న సమయంలో అనుకోకుండా వచ్చింది ఈ 'షెల్టర్ ఇన్ ప్లేస్.' ఎవరి జీవితాలను వారు తరచిచూసుకోండి ఒకసారి అన్నట్టు. మళ్లీ మీ పరుగులు మొదలెట్టే లోపు ఇన్నాళ్లు సమయం లేక చెయ్యలేక పోయిన పనుల గురించి ఆలోచించుకోండి అన్నట్టు.

రోజంతా ఇల్లు కొలుచుకుంటూ ఉండేదాన్ని. ఇప్పుడు హాయిగా ఉంది ప్రాణానికి. తన పనిలో బిజీగా ఉన్నా, ఇంకొక మనిషి మనతో ఉన్నాడనే భావన చాలు. కొండంత భరోసా. ఆఫ్ షోర్ కాల్స్ అనిచెప్పి ఇదివరకూ 'పుష్పకవిమానం' సినిమాలో లాగా ఉండేది మా సంభాషణ. మరి ఇప్పుడో!.. ఎప్పుడో చిన్నప్పుడు మా అత్తయ్య అరటిపండు ఇవ్వలేదని కరివేపాకు చెట్టెక్కి అలిగి దాక్కున్న సంగతి నుండి గోళీల ఆటలో తొండి చేసాడని పక్కింటి పిల్లాడిని చెప్పుతో కొట్టి పారిపోయిన సంగతి వరకూ ఒకటే కబుర్లు. సంపంగి పూల వాన లాగా! వాళ్ల స్కూల్ లో కుక్కపిల్లని పెంచుకునే పెద్దింటి అమ్మాయి నుండి కాలేజ్ లో వేరే డిపార్ట్మెంట్ లో ఉండే రింగుజుత్తు అమ్మాయి వరకూ తన క్రష్ ల గురించి చెప్తూంటే అమాంతం టైం మెషిన్ ఎక్కి ఆ అమ్మాయిలకు మొట్టికాయలు వేసి ఇతగాడిని లాక్కొచ్చేయ్యాలనిపించింది. అన్ని కబుర్లూ చెప్పి "అప్పట్లోనే నువ్వు పరిచయం అయ్యుంటే బాగుండు అమ్మాయ్" అంటే మాత్రం మనసు వెన్నపూసలా కరిగి ఆనందభైరవి రాగం పాడినట్టుగా తోచింది కదూ.

కరోనాకి ముందు ఇంత విశాల ప్రపంచమూ ఇరుకుగా తోచేది. అలాంటిది రెండు నెలల నుండి బాల్కనీ మాత్రమే మాకు తెలిసిన ప్రపంచం అయినప్పటికీ ఈ ప్రపంచం ఎంతో అందంగా కనపడుతోంది. జంటగా కాఫీ తాగుతూ చూసే ఉషోదయాలు, సూర్యాస్తమయాలు, పిల్లదానితో కలిసి కథలు కబుర్లూ చెప్పుకుంటూ నిద్రలోకి జారుకునే రాత్రులు, గుండె గదిలో ఏదో మూలన పెట్టెలో పెట్టి మరచిపోయిన 'నా ఆదర్శ జంట' లిస్టుకి ఆశలను కొత్తగా పూయిస్తున్నాయి. పోగొట్టుకున్న వెన్నెల రాత్రులన్నిటిని ఒక్కసారిగా ఎదుట కురిపించింది ఈ కరోనా. ముడేసుకుంటామో, వదిలేసి వెళ్ళిపోతామో మన మన తెలివితేటలని బట్టి ఉంది ఇక.

ఇలాంటి అపురూపాలని పోగేసుకుంటున్న సమయంలో వచ్చి అడుగుతున్నారు మా వాళ్లంతా. "ఏమైందీ నీకు? ఏ ఛాలెంజుల్లో పాల్గొనవేంటి? మమ్మల్ని పట్టించుకోవేంటీ?"అని. ఏమని చెప్పనూ! అందరి లాగా ఉండాలి, అందరు చేసేవి మనమూ చేయాలనుకునే క్రమంలో మనలా మనం బ్రతకడం మరచిపోతున్నామా? గతాన్ని తలచుకుంటూ భవిష్యత్తు ఊహించుకుంటూ వర్తమానాన్ని వదిలేస్తున్నామా?

అందుకనే, మా అగరు పొగల గది వెలుపల నిలబడి అందరూ అడిగే ప్రశ్నలకి నవ్వుతూనే తెర లాగేసాను. నేను నా 'హోమ్' ని 'స్వీట్ హోమ్' గా మార్చుకునే ఛాలెంజ్ లో చాలా బిజీగా ఉన్నాను మరి. నా బంగారు పుట్టలో వేలుపెడితే ఉరుకుంటానేంటి? బ్లాక్ చేసెయ్యను!

*(వచ్చేనెలలో అమెరికా అమ్మాయి ఏం చెబుతుందో.. ఎదురుచూద్దాం..!!)*